క్లుప్తంగా

జీడి, మామిడి సాగులో రైతులకు శిక్షణ



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సైంటిస్ట్ భగవాన్

సీతంపేట: జీడి,మామిడి పంటల్లో యాజమాన్య పద్ధతులపై స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానం, పెద్దపేట ఉద్యానవన పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు సంయుక్తంగా రైతులకు సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఉద్యానవన ప్రిన్సిపాల్ సైంటిస్ట్ భగవాన్ మాట్లాడుతూ.. జీడి,మామిడి పంటల్లో సీజన్‌లో వచ్చే తెగుళ్లు, వాటి నివారణ చర్యలను వివరించారు. విత్తన రకాల ఎంపిక, అంటుకట్టు విధానం, తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సైంటిస్టులు సీతారం, శ్రీనివాసరాజులు, లక్ష్మీనారాయణ, సురేష్‌కుమార్, పీహెచ్‌ఓ గణేష్, పీఏఓ హరికృష్ణ, హెచ్‌ఓ పి.జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ

పాలకొండ: జగనన్న కాలనీ పట్టాలకు సంబంధించి వీఆర్వోలు రిజిస్ట్రేషన్ పట్టాలు సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ వరహాలు సూచించారు. మండలంలోని వీఆర్వోలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ప్రభుత్వం ఇచ్చిన పట్టాలను ప్రస్తుతం రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌తో కొత్తగా పట్టాలను ప్రభుత్వం అందించిందని తెలిపారు. వాటిని గ్రామాల వారీగా వీఆర్వోలకు అందించారు. ఆయనతో పాటు టీడీ బి.బుచ్చయ్య ఉన్నారు.

భాషా వలంటీర్ల ధర్నా..



ధర్నా చేస్తున్న భాషా వలంటీర్లు

సీతంపేట: తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఐటీడీఏ ఎదుట సోమవారం ఎంఎల్ఈ వలంటీర్లు ధర్నా చేశారు. మార్చి, ఏప్రిల్ నెలలు విధుల్లో కొనసాగించాలని, వచ్చే విద్యా సంవత్సరంలో తమను రెన్యువల్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. అనంతరం ఐటీడీఏ అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్ఈ వలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆనందరావు, డొంబు, ఎల్లంగు, తదితరులు పాల్గొన్నారు.

కరోనాపై అప్రమత్తం



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

మక్కువ: కరోనాపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవడంతో పాటు జాగ్రత్తలు పాటించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మంజులవీణ అన్నారు. మండలంలోని ములక్కాయవలసలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులు దరిచేరవని అన్నారు. అనంతరం విద్యార్థులు గ్రామంలో ఇంటింటికీ మాస్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై సత్వర న్యాయం

పార్వతీపురంటౌన్: ఫిర్యాదులపై సత్వర న్యాయం జరగాలని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో భాగంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేధింపులు, కుటుంబ కలహాలు, సివిల్ తగాదాలు, ఇతర సమస్యలపై ఫిర్యాదు దారులు స్వేచ్ఛగా విన్నవించుకోగా, వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని సూచించారు. స్పందనలో ఫిర్యాదులపై తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీ సీఐ సీహెచ్ లక్ష్మణ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

వావ్.. వాటపాగు

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మారిన గ్రామం రూపురేఖలు
- పంచాయతీలో సుమారు రూ.3 కోట్లతో అభివృద్ధి పనులు
- సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు రూ.13.62 కోట్ల లబ్ధి

పాలకొండ రూరల్: మహాత్మాగాంధీ కలలుకన్న గ్రామస్వరాజ్యాన్ని సాకారం చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తోంది. వివిధ అభివృద్ధి కార్యక్రమాల ద్వారా గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న పల్లెలు.. నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రగతి పథంలో పరుగులు పెడుతున్నాయి. క్షేత్రస్థాయిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం కళ్లకు కట్టినట్లు కనిపిస్తుండటంతో ప్రభుత్వ పనితీరుపై ప్రతి ఒక్కరూ సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని వాటపాగు సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులు చకచకా జరుగుతున్నాయి. ఈ సచివాలయం పరిధిలో అట్టలి, వాటపాగు, పద్మాపురం గ్రామాలున్నాయి. వీటిలో 2,943 మంది జనాభా ఉండగా 1,439 మంది పురుషులు, 1,504 మంది మహిళలు ఉన్నారు. వారిలో 2,116 మంది ఓటు హక్కు కలిగి ఉండగా.. స్త్రీలు 1068, పురుషులు 1068 మంది ఉన్నారు. మండల కేంద్రమైన పాలకొండ పట్టణానికి ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామాలు గత టీడీపీ ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. ఏ పథకం కావాలన్నా జన్మభూమి కమిటీల అనుగ్రహం పొందాల్సి వచ్చేది. జగనన్న ప్రభుత్వంలో గ్రామానికి పట్టిన గ్రహణం వీడింది. అర్హులందరికీ ఎలాంటి సిఫార్సులు లేకుండా పథకాలు అందుతున్నాయి. సీసీరోడ్లు, తాగునీటి పథకాలు, ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నిధులు కేటాయించడంతో ప్రాధాన్యత క్రమంలో పనులు చేపడుతున్నారు.



వైఎస్సార్ గ్రామీణ ఆరోగ్య కేంద్రం



వాటపాగులో అన్నదాతకు సేవలందించేందుకు సిద్ధమవుతున్న ఆర్‌బీకే

సచివాలయం పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు

- వాటపాగు పంచాయతీ కేంద్రం ద్వారా ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు రూ.40 లక్షలతో గ్రామ సచివాలయ నిర్మాణం.
- వ్యవసాయ సిబ్బంది రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలందించేందుకు వీలుగా రూ.22 లక్షలతో రైతుభరోసా కేంద్రం నిర్మాణం
- రూ.3 లక్షల వ్యయంతో అట్టలి శ్మశనావాటికకు సీసీ రోడ్డు ఏర్పాటు.
- పల్లె వాసులకు సురక్షిత తాగునీరు అందించేందుకు గాను జలజీవన్ మిషన్ ద్వారా రూ.80 లక్షల వ్యయంతో అట్టలి, వాటపాగు గ్రామాల్లో యుద్ధప్రాతిపదికన వాటర్ ట్యాంకులను నిర్మిస్తున్నారు.
- అట్టలి, వాటపాగు గ్రామాల్లో రూ.32 లక్షల వ్యయంతో రెండు డిజిటల్ లైబ్రరీలను ఏర్పాటు చేస్తున్నారు.
- నాడు–నేడు కార్యక్రమం ద్వారా రూ.18 లక్షలతో వాటపాగు ఎంపీపీ పాఠశాలను, రూ.12 లక్షలతో అట్టలి ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేశారు.
- రూ.3 లక్షల వ్యయంతో వాటపాగు అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆధునీకరించి ప్రీస్కూల్‌గా తీర్చిదిద్దారు.
- సచివాలయం పరిధిలో ప్రజలకు నిరంత వైద్య సేవలు అందించేందుకు వీలుగా వాటపాగులో హెల్త్ సబ్‌సెంటర్ ఏర్పాటు చేయటం జరింగి. అందులో పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని నియమించి సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు.
- 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ద్వారా సచివాలయ పరిధిలో రూ.20 లక్షల వ్యయంతో వీధికాలువలు నిర్మించారు.

డీబీటీ, నాన్ డీబీటీ విధానంలో లబ్ధి..

నవరత్నాల పేరిట సచివాలయ పరిధిలో అర్హులకు కోట్ల రూపాయల విలువతో కూడిన సంక్షేమ ఫలాలను అందించటం జరిగింది. డీబీటీ విధానంలో రూ.13,62,51,716ను లబ్ధిదాలకు బ్యాంక్ ఖాతాలకు నేరుగా జమచేయటం జరిగింది. 55 మందికి సంబంధించి ఇళ్ల స్థలాలు కోసం భూ సేకరణకు, 173 మందికి విద్యాకానుక అందించేందుకు, 8వ తరగతి చదువుతున్న 16 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు, 155 మంది విద్యార్థులకు గోరుముద్ద పథకం అమలుకు, 82 మందికి జగనన్న తోడు రుణాలు, వైఎస్సార్ సంపూర్ణ పోషణ 161 మందికి, 424 మందికి రేషన్ అందించే క్రమంలో రూ.3.63 కోట్లకుపైగా ప్రభుత్వం ఖర్చుచేసింది.





వాటపాగు గ్రామ సచివాలయ భవనం



నాడు-నేడుతో సర్వాంగ సుందరంగా మారిన ప్రభుత్వ పాఠశాల

సంక్షేమ లబ్ధి నేరుగా పొందుతున్నాం



నాతోపాటు మా గ్రామంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి.గతంలో ఏ పథకం పొందాలన్నా ఎన్నో ఇబ్బందులు ఉండేవి. ఇప్పుడు వలంటీర్ వ్యవస్థ కారణంగా ఆ పరిస్థితి లేదు. గ్రామంలో సచివాలయ వ్యవస్థ ఉండటంతో పనులన్నీ స్థానికంగా జరుగుతున్నాయి. రూ.కోట్లు ఖర్చుతో గ్రామంలో ప్రభుత్వ భవనాలు కట్టారు. పిల్లల చదవులు సక్రమంగా సాగేలా బడులు తీర్చిదిద్దారు. పెద్దపెద్ద డాక్టర్లు గ్రామాల్లోకి వస్తున్నారు. రైతులు సంతోషంగా వ్యవసాయం చేస్తున్నారు. నా బిడ్డ వలంటీరుగా పనిచేస్తుంది. దీంతో గ్రామంలో మా కుటుంబాని మరింత గౌరవం దక్కింది. – వారాడ వెంకటరమణ, రైతు, వాటపాగు గ్రామస్తుడు

పథకం	లబ్ధిదారులు	చెల్లించిన మొత్తం
జగనన్న అమ్మ ఒడి	245	రూ.1,12,78,329
జగనన్న విద్యాదీవెన	203	రూ.43,25,188
జగనన్న వసతి దీవెన	159	రూ.25,16,725
వైఎస్సార్ రైతు భరోసా	582	రూ.2,84,80,500
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	1	రూ.1276
వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు	246	రూ.7,23,202
వైఎస్సార్ పెన్షన్ కానుక	512	రూ.4,81,42,750
వైఎస్సార్ చేయూత	305	రూ.1,36,50,000
వైఎస్సార్ ఆసరా	592	రూ.1,66,07,688
వైఎస్సార్ సున్నా వడ్డీ (ఎస్‌హెచ్‌జీలకు)	677	రూ.12,74,757
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	3	రూ.90,000
వైఎస్సార్ కళ్యాణమస్తు/షాదీతోఫా	1	రూ.50,000
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	108	రూ.38,39,528
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	66	రూ.4,21,675
హౌసింగ్ (లబ్ధిదారులకు నేరుగా చెల్లింపులు)	18	రూ.17,78,220
వైఎస్సార్ బీమా	4	రూ.9,30,000
వైఎస్సార్ వాహనమిత్ర	17	రూ.4,20,000
జగనన్న చేదోడు (రజకులు, నాయీబ్రహ్మణులు, టైలర్లు)	3	రూ.30,000
కోవిడ్ ప్రత్యేక సహాయం (తెల్ల రేషన్ కార్డుదారులకు)	741	రూ.7,41000
జగనన్న తోడు(వడ్డీ)	42	రూ.14,878
నేతన్న నేస్తం	10	రూ.9,36000

స్పందన వినతులపై సత్వర చర్యలు



వినతులు స్వీకరిస్తున్న ఆర్డీఓ వెంకటరమణ

పాలకొండ: 'స్పందన'లో అందిన వినతుల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటున్నామని ఆర్డీఓ వెంకటరమణ అన్నారు. ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులు రైతులకు ఉపయోగకరంగా ఉండటం లేదని, చెరువులను అభివృద్ధి చేయాలని అభ్యుదయ రైతు కండాపు ప్రసాదరావు అధికారులను కోరారు. దీనిపై ఆర్డీఓ స్పందిస్తూ.. నీటిపారుదలశాఖ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని, స్థల సమస్యలపై పలు వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేశారు.

బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలి



నిరసన తెలియజేస్తున్న ఏగులవాడ గ్రామస్తులు

గుమ్మలక్ష్మీపురం: జనవరి నెలలో అందజేయాల్సిన రేషన్ బియ్యంను ఇంతవరకు పంపిణీ చేయకపోవడంతో ఏగులవాడ గ్రామస్తులు సోమవారం జీసీఎంఎస్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. సేల్స్‌మన్ ఫిబ్రవరి నెలకు సంబంధించి రేషన్ బియ్యం పంపిణీ చేసినా.. జనవరి నెలలో గ్రామంలోని సుమారు 150 మంది కార్డుదారులకు బియ్యం పంపిణీ చేయలేదని తెలిపారు. గత నెల బియ్యం ఇవ్వాలని అడిగితే తప్పించుకుని తిరుగుతున్నాడని వాపోయారు. దీనిపై బ్రాంచ్ మేనేజర్ స్పదించి సేల్స్‌మన్ జగదీష్‌ను పిలిపించి మాట్లాడి, కార్డుదారులకు బియ్యం పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఒత్తిడికి గురికావద్దు



విద్యార్థులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ గీతాంజలి

సీతంపేట: పదోతరగతి విద్యార్థులు ఒత్తిడికి గురికావద్దని ఎంపీడీఓ కె.గీతాంజలి సూచించారు. స్థానిక బాలుర గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షలకు ఎలా సన్నద్ధంకావాలి, ఒత్తిడిని ఎలా అధిగమించాలి, పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వారికి వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం టి.చంద్రరావు, డిప్యూటీ వార్డెన్ గానయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై అప్రమత్తం



గురుకుల విద్యాలయంలో సిక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డీఎంఓ జగన్ మోహనరావు

సీతానగరం: ప్రభుత్వ వసతిగృహ విద్యార్థుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా నివారణాధికారి (డీఎంఓ) టి. జగన్ మోహనరావు అన్నారు. మండలంలోని జోగింపేటలో ఉన్న గిరిజన, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం, కేజీబీవీ మహిళల విద్యాలయంలో విద్యార్థులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. అలాగే దోమల నివారణకు తీసుకోవాల్సిన అంశాలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిక్ రికార్డులు, మందులను పరిశీలించారు. గురుకులం ప్రిన్సిపాల్ పోల వెంకటినాయుడు మాట్లాడుతూ.. వివిధ రకాల వ్యాధుల నివారణకు అవసరమైన మందులు ప్రభుత్వం సమకూర్చిందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, హెల్త్ సూపరువైజర్ శర్మ, వైద్య సిబ్బంది చైత్యన్య, లావణ్య, హరికృష్ణ పాల్గొన్నారు.

జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లో ప్లాట్ల కేటాయింపు



ప్లాట్ల కేటాయింపు ప్రక్రియ చేపడుతున్న అధికారులు

సాలూరు: పట్టణంలో బుడా ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లో ప్లాట్లను లబ్ధిదారులకు కేటాయించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన సోమవారం జరిగిన కార్యక్రమంలో అధికారులు ఆన్‌లైన్ లాటరీ ప్రక్రియ ద్వారా లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయించారు. 20 శాతం రాయితీపై నలుగురుకి, మిగిలిన 12 మందికి సాధారణ రీతిలో ప్లాట్లను కేటాయించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కమిషనర్ ప్రసన్నవాణి, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక నోటిఫికేషన్ ఇవ్వాల్సిందే...



ఆదివాసీ సంఘ సభ్యుల ర్యాలీ

పార్వతీపురం: షెడ్యూల్–5 ప్రాంతానికి ప్రత్యేక నోటిఫికేషన్ ఇచ్చి గిరిజనులతోనే ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేయాలని ఆదివాసీ జేఏసీ చైర్మన్ కె. ధర్మారావు కోరారు. ఈ మేరకు పట్టణంలో గిరిజనులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డీఎస్సీ–2024 ఉపాధ్యాయ నియమకాల్లో షెడ్యూల్–5లోని పోస్టులు కలపడం వల్ల గిరిజనులు నష్టపోతారన్నారు. ఆదివాసి ప్రాంతంలో నివసించే గిరిజనులకు ప్రత్యేక డీఎస్సీని నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు గిరిజన నాయకులు, యువత పాల్గొన్నారు.

నేడు నేరెళ్లవలసలో వైద్యశిబిరం

సాలూరు: మండలంలోని నేరెళ్లవలసలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు రూరల్ ఎస్సై వెంకటరమణ తెలిపారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాలతో రూరల్ సీఐ బాలకృష్ణ పర్యవేక్షణలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పరిసర గ్రామాల ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'పల్స్‌పోలియో'ను విజయవంతం చేయాలి



వీరఘట్టం: ఆరోగ్య సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీఓ సాల్మన్‌రాజ్

వీరఘట్టం: మార్చి 3న నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజ్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వీరఘట్టం, బిటివాడ వైద్యాధికారులు డాక్టర్ ఉమామహేశ్వరి, నితీషా ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీలతో సోమవారం సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో వలంటీర్ల సహకారంతో ఐదేళ్ల లోపు చిన్నారులను గుర్తించి వారికి పోలియో చుక్కలు వేయించాలని సూచించారు.

- **భామిని:** వచ్చే నెల 3న నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతం అయ్యేలా అన్ని శాఖల అధికారులు సహకరించాలని భామిని పీహెచ్‌సీ వైద్యాధికారి సంతోషలక్ష్మి, సీహెచ్‌ఓ భాస్కరరావు కోరారు. భామినిలో ఈఓపీఆర్డీ కె.కృష్ణారావు ఆధ్వర్యంలో వివిధ శాఖల సిబ్బందితో సోమవారం సమావేశమయ్యారు. పల్స్‌పోలియో కార్యక్రమ ఏర్పాట్లుపై సమీక్షించారు. మండల పరిధిలో ఉన్న ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేసేలా ఆరోగ్య సిబ్బంది కృషిచేయాలన్నారు. పల్స్‌పోలియో కార్యక్రమం ఆవశ్యకతను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఎంఈఓ వి.భాస్కరరావు, ఐసీడీఎస్ ఎస్ఓ సబితా పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.



భామిని: సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి సంతోషలక్ష్మి

విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా బోధన



బత్తిలి పాఠశాలలో గోరుముద్ద భోజనాలను రుచి చూస్తున్న ఎంఈఓ సూర్యదేవుడు

భామిని: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచేలా హెచ్‌ఎంలు చర్యలు తీసుకోవాలని ఎంఈఓ ఎ.శ్రీనివాస్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండలంలో పని చేస్తున్న హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. మెరుగైన విద్యాబోధనకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. సీతానగరం మండల ఎంఈఓ–1 జి.సూర్యదేవుడు సమావేశంలో పాల్గొని ఆర్‌జేడీ ఇచ్చిన ఆదేశాలు వివరించారు. ప్రతీ పాఠశాల తనిఖీ చేపడతానన్నారు. ప్రతీ విద్యార్థి చదవడం, రాయడంలో కచ్చితంగా మెరుగుపడేలా ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకొని బోధన చేపట్టాలన్నారు. అంతకుముందు సీతానగరం ఎంఈఓ సూర్యదేవుడు బత్తిలి ఎంపీపీ స్కూల్‌ను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో బత్తిలి, భామిని, బాలేరు, పెద్దదిమిలి జెడ్‌పీహెచ్ఎస్, ఎంపీపీ పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, సొసైటీ సభ్యులు

భామిని: మండలంలోని బాలేరుకు చెందిన విశ్రాంత రెవెన్యూ అధికారి రొక్కం నరసింహారావు(84) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వైఎస్సార్ సీపీ మండల నాయకులు సోమవారం నరసింహారావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆనయ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని ప్రగాఢ సంతాపం తెలియజేశారు. సర్వజన శ్రేయోభిలాషి వెల్ఫేర్ సొసైటీ చైర్మన్‌గా ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. పరామర్శించిన వారిలో నాగార్జున వర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ఆర్.సుదర్శన దొర, నీటి సంఘం అధ్యక్షుడు రొక్కం రామారావు, ఎంపీటీసీ సభ్యుడు కొత్తకోట చంద్రశేఖర్, సర్పంచ్ జామి ప్రభాకర్, మేడిబోయిన చలపతి, విశ్రాంత ఉపాధ్యాయుడు అడపా తవిటినాయుడు, తదితరులున్నారు.

వేదన తీరింది



అధ్వానంగా ఉన్న పెళ్లివలస గ్రామ రహదారి

కురుపాం: మండలంలోని బియ్యాలవలస పంచాయతీ పెళ్లివలస గ్రామానికి వెళ్లే రోడ్డు రాళ్లతేలి అధ్వానంగా ఉండేది. వర్షాకాలంలో అయితే మరింత దారుణంగా తయారయ్యేది. ఈ రోడ్డులో రాకపోకలు సాగించేందుకు ప్రజలు అవస్థలు పడేవారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలో గ్రామానికి బీటీరోడ్డు నిర్మించాలని అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులను ఎన్నిసార్లు కోరినా పట్టించుకున్న దాఖలాలు లేవు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక గ్రామస్తులు ఎమ్మెల్యే పుష్పశ్రీవాణిని కలిసి బీటీరోడ్డు నిర్మించాలని వినతిపత్రం అందజేశారు. ఆమె వెంటనే స్పందించి ఉపాధిహామీ పథకం నిధులు రూ.15 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో గిరిజన ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సుమారు 450 మీటర్ల మేర గ్రామానికి బీటీరోడ్డు నిర్మాణం చేపట్టారు. నాడు రాళ్లదారి నేడు పూలదారిలా మారిందని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



రూ.15 లక్షలతో గ్రామానికి నిర్మించిన బీటీరోడ్డు